నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
గురువారం | మే16 , 2024 | www.navatelangana.com

నేడు నన్నూరి అంజిరెడ్డి సంతాప సభ

- హాజరుకానున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-నల్లగొండటౌన్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ నన్నూరి అంజిరెడ్డి సంతాపసభ గురువారం తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం బిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంతాప సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చేరుపెల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శిముదిరెడ్డి సుధాకర్ రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు.. ఈ సంతాప సభకు జిల్లాలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు.

జన్మదిన వేడుకల్లో..ఎమ్మెల్యే వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్



కేతేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంపాసటి శ్రీనివాస్, నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదగోని కొండయ్య జన్మదినం సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి లు శాలువాలతో సత్కరించి కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



19 న సుందరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలి

- సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఈనెల 19న మిర్యాలగూడలో నిర్వహించనున్న సుందరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో సుందరయ్య వర్ధంతి సభను నిర్వహించాలని కోరారు. మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలోసుందరయ్య 39 వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. సుందరయ్య చేసిన త్యాగాలను ఈ సభలో వివరించి కార్యకర్తల్లో రాజకీయ చైతన్యం తీసుకురానున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక సమస్య ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీజిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీష్ చంద్ర, రవి నాయక్, డా.మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, శశిధర్ రెడ్డి, వినోద్ నాయక్, ఆయూబ్, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్, రొండి శ్రీనివాస్, జాతంగి సైదులు, పాపిరెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

- ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దు
- ఎన్నిక జిల్లా సాధారణ పరిశీలకులు రాహుల్ బోజ్జ
- ఎన్నికల విధులలో ఉండే ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్
- ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

వరంగల్ ఖమ్మం నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని పట్టబద్రుల శాసనమండలి ఉప ఎన్నిక జిల్లా సాధారణ పరిశీలకులు రాహుల్ బోజ్జ అన్నారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సులభంగా తీసుకోవద్దని, తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని, ఎన్నికల సంఘం జారీచేసిన సూచనలు, నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించి ఒకటికి రెండుసార్లు చదువుకోవాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు తనను శాసనమండలి పట్టబద్రుల ఉప ఎన్నికకు పరిశీలకులుగా నల్గొండ జిల్లాకు నియమించడం జరిగిందని, ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు తాను ఎన్నికలను పరిశీలిస్తానని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర విషయాలకు సంబంధించి తనని సంప్రదించాలను కునేవారు 9866377107 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చుని తెలిపారు. నామినేషన్లను మొదలుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇతర ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికలకు సైతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఒకే విధంగా ఉంటుందని, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనల పరిధి దాటకుండా ఎంసిసి అమల్లో ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు వారి ప్రచారంలో కులం, మతం, ఎదుటి వ్యక్తులను దూషించడం, ప్రార్థనా స్థలాలలో ప్రచారం వంటివి చేయకూడదని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దని, ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ఇండ్ల గోడలపై రాతలు రాయటం, హోర్డింగులు ఏర్పాటు చేయడం వంటివి చేయవద్దని, ర్యాలీలు ఇతర వాటికి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ప్రజలకు సాధారణ జీవన పరిస్థితులకు ఆటంకం కలిగించవద్దని, ఎవరిని భయపెట్టకూడదని, ఎలక్ట్రానిక్ ,సోషల్ మీడియాలో ఇచ్చే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలనిన సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు పార్లమెంటు ఎన్నికల ప్రచార సైలెన్స్ పీరియడ్ పూర్తయినందున పూర్తిస్థాయిలో ఎమ్మెల్సీ ప్రచారాన్ని నిర్వహించుకోవచ్చుని, ఆయా జిల్లాలలో ప్రచారం నిర్వహించుకుంటే సంబంధిత ఏఆర్వోల ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదులు చేయవలసి వస్తే 1950, 1800425144 నెంబర్ల ద్వారా తెలియజేయవచ్చుని తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి పూర్ణచంద్ర, నల్గొండ ఆర్డీవో రవి, ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు, తదితరులు హాజరయ్యారు.





ఓటరు మహాశయులకు కృతజ్ఞతలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు

పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి, ఆశీర్వదించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. బుధవారం చండూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నామినేషన్ నుండి ఇప్పటివరకు అహర్నిశలు పనిచేసిన పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఓటర్ మహాశయులకు ప్రజలకు కార్మికులకు పత్రిక విలేకరులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థి,మేధావులకు, కవులు, కళాకారులకు, ఎలక్షన్‌లో పాల్గొన్న సిబ్బందికి అందరికీప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చండూరు మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, చండూరు మండల సహాయ కార్యదర్శి జెర్రీపోతుల ధనంజయ గౌడ్, సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, రవి, గౌసియా బేగం, కొత్తపల్లి నరసింహ, వెంకన్న, స్వామిపాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-నకిరేకల్

ఈ నెల 16న గురువారం నకిరేకల్ పట్టణ కేంద్రంలో 11కెవి పోలీస్ స్టేషన్ ఫీడర్ లైన్ ఏ బి స్విచ్ ల రిపేరు కొరకు ఉ.7 నుండి 8 గంటల వరకు వీటీ కాలనీ, కాటమయ్యా బజార్, రెహ్మాత్ నగర్, చీమలగడ్డ,పటేల్ నగర్, సంతోష్ నగర్, మూసి రోడ్, డాక్టర్స్ కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, శివాజీ నగర్, విద్యానగర్, తాటికల్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్, రఘురామ థియేటర్ ఎదురుగా, సూర్యనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ పి.సాయి గణేష్ తెలిపారు.

కార్పొరేట్ కళాశాలలో .. ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- ఈనెల 30 వరకు గడువు
- కలెక్టర్ దాసరి హరిచందన

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

విద్యా సంవత్సరం 2024 మార్చిలో 10వ, తరగతి ఉత్తీర్ణులై 7జీపీఏ, ఆ పైన పొందిన, నల్లగొండ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ,, మైనార్టీ, దివ్యాంగుల, విద్యార్థులు కార్పోరేట్ కళాశాల యందు అడ్మిషన్‌కు నేటి నుండి ఈనెల 30వ తేదీ వరకు ఆన్లైన్లో ధరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన దాసరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హతలు ఇవే....

ధరఖాస్తు చేసుకొను విద్యార్థులు ఏదేని సంక్షేమ శాఖల వసతి గృహములలో గడిచిన 3 సం. రాలు వసతి పొంది, ప్రభుత్వ లేదా ఎయిడెడ్, ఆశ్రమ పాఠశాలలు, (కెజిబియస్) కస్తుర్బా పాఠశాల యందు చదవినవారై ఉండాలి.అంతేకాకుండా ప్రభుత్వ, మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు జవహర్ నవోదయ విద్యాలయములో చదివిన విద్యార్థులు అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న బెస్ట్ అవైలబుల్ స్కీం యందు చదివిన వారు కూడ అర్హులు. విద్యార్థుల (తల్లి/దండ్రుల) సంవత్సర ఆదాయం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ దివ్యంగుల విద్యార్థుల వారికి అర్బన్ లో రూ.2.00 లక్షలు (పట్టణ ప్రాంతం), రూ.1.50 లక్షలు (గ్రామీణ ప్రాంతం) మించరాదు.విద్యార్థులు telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.

బుచ్చిరెడ్డికి కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారం

నవతెలంగాణ-చండూరు



చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి తెలంగాణ సాయుధ పోరాట యోధులు కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారానికి ఎంపికైనట్లు విజ్ఞాన వికాస మండలి కన్వీనర్ వి. సుమలత, వ్యవస్థాపక అధ్యక్షులు మధుకర్ వైద్యుల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మండలి నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల కవితల పోటీలో బుచ్చిరెడ్డి (నల్గొండ)తో పాటు ఎస్. లహరి(హైదరాబాద్), జి. వి. రమణ (అనంతపురం), ఆలేటి పరంజ్యోతి(ఖమ్మం), రాకుమారి (పెద్దపల్లి) ని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురికి ప్రోత్సాహ బహుమతుల కింద ఎంపిక చేసి, వీరందరికి త్వరలో హైదరాబాదులో జరిగే 31వ వార్షికోత్సవంలో పురస్కారాలు అందజేయున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. బుచ్చిరెడ్డి పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

డీసీఎం బోల్తా...



- ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ -శాలిగౌరారం

వరికోత మిషన్ ను తీసుక వెళ్తున్న డీసీఎం ప్రమాద వశాత్తు బోల్తా పడిన సంఘటనలో ముగ్గురి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు..సంఘటన కు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.మంగళవారం అర్ధ రాత్రి 12 గంటల ప్రాంతంలో మిర్యాలగూడ నుంచి వరంగల్ కు డీసీఎం వరికోత మిషన్ ను లోడు చేసుకొని బయలుదేరింది. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం వద్ద జాతీయ రహదారి పైన ఎదురు గా వేగంగా వస్తున్న లారీని,వరికోత మిషన్ ను తీసుకవెళ్తున్న డీసీఎం డ్రైవరు పక్కకు తప్పించారు. అదుపు తప్పిన డీసీఎం బోల్తాపడింది. ఈ సంఘటన లో డీసీఎం డ్రైవర్ కత్తుల శివరాజు కు నడుము విరిగి తీవ్ర గాయాలు కాగా వరికోత మిషన్ ఆపరేటర్ రాయి చంద్ర శేఖర్ కు, క్లీనర్ పరిమళ్ కు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడం తో వీరిని స్థానికులు నల్గొండ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బోల్తా పడిన డీసీఎం, వరికోత మిషన్ నుజ్జు నుజ్జు అయ్యాయి.ఇది ఇలా ఉండగా సందేట్లో సడేమియా చందంగా బోల్తా పడిన డీసీఎం టైర్లను, వరికోత మిషన్ టైర్లను, ఇతర పరికరాలను కొందరు దొంగిలించినట్లు డీసీఎం యజమాని బచ్చు శ్రీనివాస్ శాలిగౌరారం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు %బాక్మీ% వాసా ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ప్రజా చైతన్య గాయకుడు, రచయిత పొలిశెట్టి

నవతెలంగాణ-వేములపల్లి



ప్రజా చైతన్య గాయకుడు, రచయిత పోలిశెట్టి లింగయ్య అని మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. బుధవారం మండలంలోని సల్కునూర్ గ్రామంలో పోలిశెట్టి లింగయ్య 12వ వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ పోలిశెట్టి లింగయ్య ఎన్నో రాజకీయ చైతన్య ఉద్యమ, సినిమా పాటలను అందించిన సహజ ప్రజాకవి అని గుర్తు చేశారు. సమాజానికి అందించిన పాటలు జనం నాలుకలో నానుతూనే ఉన్నాయనిగుర్తు చేశారు. గాయకుల్లో , రచయితలలో స్పూర్తిదాయకమైన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి సుదర్శన్, నర్సింగోజు రవి, నకిరేకంటి కిరణ్, కుమార్, బాలు నాయక్, ప్రతాప్, బచ్చలకూరి శ్రీనివాస్, నాగిళ్ళ కొండల్, శోభన్ బాబు, మధు తదితరులు ఉన్నారు.

4,48,328 మంది ఓటు వేయలే...

- ఓటర్ కార్డును గుర్తింపు కార్డుగానే భావిస్తున్న కొందరు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం. దేశ చరిత్రలో ఒక్క ఓటు తేడాతో ఓడిపోయిన అభ్యర్థులూ ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం ఎంతగా ప్రచారం చేసినప్పటికీ దాని వినియోగంలో మాత్రం చాలా మంది దూరంగా ఉంటున్నారు. ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే ధోరణిలోనే ఉన్నారు. సోమవారం జరిగిన లోక్సభ ఎన్నికల్లో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 448328 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1725465 మంది ఓటర్లు ఉండగా 1277137 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 4.40 లక్షల మంది ఓటుకు దూరంగా ఉండటానికి కారణాలను యంత్రాంగం పరిశీలిస్తోంది. ఓటర్ల పండగ లాంటి కార్యక్రమాలు, చైతన్య సదస్సులు 2కె,5కె రన్ వంటివి నిర్వహించి ఓటర్లను చైతన్య పరిచారు. నల్గొండ జిల్లాలో హుజూర్నగర్ నియోజకవర్గంలో అత్యధికంగా 191945 ఓట్లు పోలవగా, అత్యల్పంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో173334 పోలవడం గమనార్హం. ఓటు వినియోగంలో పట్టణ ఓటర్ల కన్నా గ్రామీణ ఓటర్లలోనే చైతన్యం ఎక్కువ ఉంది. ఓటరు కార్డును కేవలం గుర్తింపు కార్డుగా మాత్రమే చాలా మంది ఉపయోగిస్తున్నారనేది స్పష్టమవుతోంది.




నల్గొండ జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా...నియోజకవర్గంలో మొత్తం ఓట్లు పోలైనవి, వేయనివారు వివరాలు ఇలా ఉన్నాయి...

దేవరకొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 262480, ఓట్లు పోలైనవి 185310, ఓటు వేయను వారు 77170 మంది ఓటర్లు. అదేవిధంగా నాగార్జునసాగర్ లో మొత్తం ఓటర్లు 236484, పోలైనవి 176190, ఓటు వేయని వారు 60294, మిర్యాలగూడలో మొత్తం ఓటర్లు 236343, పోలైనవి 173334, ఓటు వేయని వారు 63009. హుజూర్నగర్ లో మొత్తం ఓటర్లు 251444, పోలైనవి 192945, ఓటు వేయని వారు 59499. కోదాడలో మొత్తం ఓటర్లు 245187, పోలైనవి 184415, ఓటు వేయని వారు 60772. సూర్యాపేటలో మొత్తం ఓటర్లు 244116, పోలైనవి 178378, ఓటు వేయని వారు 65738. నల్లగొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1725465, పోలైనవి 187565, ఓటు వేయని వారు 61846 మంది ఓటర్లు ఉన్నారు.

ఓట్ల డూప్లికేషన్ పై ... బీఆర్ఎస్ సీరియస్

- కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుకు రంగం సిద్ధం

నవతెలంగాణ-నల్లగొండటౌన్



నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో ఒక్కో ఓటరు రెండేసి ఓట్లు వేసిన అంశాన్ని బి ఆర్ యస్ పార్టీ సీరియస్ గా తీసుకుంటుంది.రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన 41 వ వార్డు లోని పోలింగ్ స్టేషన్ 176,137 లలో పొలయిన ఓటరు నెంబర్ NZA 2589125,NZA 2526655 ఒక్కరే కావడంతో ఈ విషయాన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు ఆ పార్టీ న్యాయనిపుణులను సంప్రదిస్తుంది.అవసరమైతే తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘానికి ఆ పార్టీ ఫిర్యాదు చేయనుంది.ఇదే వార్డులో ఈ తరహా వంద ఓట్ల వరకు పొలు అయినట్లుగా ఆ పార్టీ అనుమానిస్తుంది.దానికి తోడు పక్కనే ఉన్న 42 వ వార్డులో పొలయిన ఓట్లు 41 వ వార్డులో కుడా పోలయినట్లు ఆపార్టీ దృష్టికి రావడంతో నల్గొండ లోకసభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుక పోయేందుకు సన్నద్ధం అవుతున్నారు.రీపోలింగ్ అయ్యే దాకా కౌంటింగ్ ను నిలిపి వేయాలని ఆయన ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం అధికారులు రంగంలోకి దిగి డూప్లికేషన్ కు సంబంధించిన అంశాలపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఓటర్ల డూప్లికేషన్ ను పరిశీలించాల్సిన బీఎల్ఓలు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నందునే ఇటువంటి దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయని ఈ విషయంలో స్థానిక అధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోని పక్షంలో కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు న్యాయస్థానలను ఆశ్రయించేందుకు కసరత్తు చేస్తున్నట్లు బీఆర్ఎస్ లోకసభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ఇటుక బట్టీల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఇటుక బట్టీల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మూడవత్ జగన్ నాయక్ కోరారు. బుధవారం స్థానిక ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ పంచాయతీలో ఉన్న ఇటుక బట్టీని పరిశీలించినట్టు తెలిపారు.ఈ ఇటుక బట్టీ లవల్ల ఈ కాలనీలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు పోయే బాటను కూడా యజమాన్యం ఆక్రమించడంతో కాలనీలోకి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇటుక బట్టీల నిర్వ హణలో కాలుష్య నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ఈ కాలనీలో ఉండే ప్రజలు ఇండ్లలో దుమ్ము దూలి చేరి తినే అన్నం కూడా కలుషితమౌతాదన్నారు. కాలనీ ప్రజలు అనేక రోగాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఇటుక బట్టే యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి తక్షణం అక్కడి నుంచి ఇటుక పట్టిన తొలగించాలి విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, నుమన్, జావిద్, పర్వేజ్, బిస్మిల్లా, తరుణ్, మోహన్ పాల్గొన్నారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి

- ఎమ్మెల్యేలు. వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



యువత స్వయం శక్తితో ఎదిగి సమాజానికి దిక్సూచిగా నిలవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి అద్దంకి రహదారి పై నూకల విజయ్‌కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన 'మద్రాస్ ఫిల్టర్ కాఫీ' షాపును బుధవారం వారు ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిల్టర్ కాఫీ యాజమాన్యం ఎమ్మెల్యేలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమాని నూకల విజయ్ కుమార్, గోలి అమరేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటిసిలు మాదా యాదగిరి గౌడ్, దూదిమెట్ల సత్తయ్య యాదవ్, మాజీ సర్పంచ్ లు నేతగాని కృష్ణ, పుల్లంల అచ్చాలు, మాజీ ఎంపీటీసీ అయిత రాజు యాదయ్య, నాయకులు సట్టు సత్తయ్య, భరత్, గడుసు శశిధర్‌రెడ్డి, గడ్డం పశుపతి, సమద్, సత్యనారాయణ, రాధారపు బిక్షపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

17 నుండి డిగ్రీ సెమిస్టర్‌ల రెగ్యులర్ , బ్యాక్ లాగ్ పరీక్షలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్‌ల రెగ్యులర్, బ్యాక్ లాగ్, 1,3,5 సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలు ఈనెల 17 నుండి నిర్వహించనున్నట్లు సి ఓ ఈ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం, పట్టణంలో బుధవారం మండల వ్యవసాయ అధికారిని దీప్తి పట్టణంలోని ఫ్యూచర్ క్రాప్ సెంటర్, లక్ష్మి నరసింహ ఎరువుల దుకాణం, కొలను పాక ఆగ్రో రైతు సేవ కేంద్రం , రాజరాజేశ్వరి ఎరుల దుకాణం, పిఎసిఎస్ గొలనుకొండలలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దుకాణదారులు పడగల రాజు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని అనాజీపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీసీ, బైపీసీ, సిఈసి, ఎంఈసి గ్రూపులకు ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని ఆమె తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన బాల, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీటు పొందాలనుకునే వారు మీ మొబైల్, ఇంటర్ నెట్ షాపులలో, నేరుగా కళాశాలలో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కావున విద్యార్థినీ,విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్సైట్ www.tsmodelschools.com దర్శించాలని లేదా 9133033320 నంబర్ కు ఫోన్ చేయాలని అన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

- నారాయణఖేడ్ ఆర్డీఓ పై చర్యలు తీసుకోవాలి టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ-కోదాడరూరల్

పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగ ఉపాధ్యాయులపై నారాయణఖేడ్ ఆర్డీఓ పోలీసుల చేత లాఠీచార్జి చేయించడానికి టీఎస్‌యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు పి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్‌డిఓ పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలన్నందుకు పోలీసులు బలప్రయోగం చర్యలను ఖండిస్తూ బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీయఫ్ హుజూర్‌నగర్ మండల శాఖ డిమాండ్ చేసింది. రెమ్యునరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపర్చారు. నిబంధనలు పాటించకుండా ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో మరియు పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీయఫ్ హుజూర్‌నగర్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి రామకృష్ణ డిమాండ చేశారు.

హుజూర్‌నగర్:ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలక్షన్ డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు టిఏడిఏ రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయ పై లాటి చార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్‌డీఓపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీఎస్ యుటిఎఫ్ హుజూర్ నగర్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ను పకడ్బందీగా అమలు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్



నవతెలంగాణ -సూర్యాపేట కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా అధికారులతో ఆదనవు కలెక్టర్ సిహెచ్. ప్రియాంకతో కలసి వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న ఎన్నిక ఉన్నందున జిల్లాలోని ప్రతి డివిజన్‌లో ఎక్కడ కూడా ఎంసీసీ వైలేషన్ కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని , ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చాలని సూచించారు. ఎఫ్ఎస్‌టి బృందలు నిఘా పెంచాలని, అదేవిదంగా 71 పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు పరిశీలన చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై 16న గురువారం ఏర్పాటు చేసే సమావేశానికి నోడల్ అధికారులు హాజరు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సి.ఈ. ఓ అప్పారావు, ఆర్.డి.ఓలు సూర్యాపేట వేణుమాధవ్, హుజూర్ నగర్ శ్రీనివాస్, కోదాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్నను మెజార్టీతో గెలిపించాలి

- కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బట్టు అమ్మనాయక్

నవతెలంగాణ-చిలుకూరు

ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బట్టు అమ్మనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని జానకి నగర్ తండా గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికలలో సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకై కృషిచేసిన వివిధ రాష్ట్రాలలో దేశాలలో ఉద్యోగాలు చేస్తూ వచ్చి ఓట్లేసి వెళ్లిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిపే లక్ష్యంగా ప్రతి ఒక్క పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి పని చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బట్టు శ్యాం కుమార్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బర్మావత్ రాజేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నెల్లూరు బ్రహ్మాచారి పవన్ నాగు రాఘవేంద్రరావు రవి తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్



నవతెలంగాణ-తిరుమలగిరి

రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను ఈనెల 27నజరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా తీన్మార్ మల్లన్న రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలతో పాటు అణగారిన వర్గాల ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని మీడియా ద్వారా ప్రభుత్వాన్ని నిలదీసి వారికి తగు న్యాయం చేశారని అన్నారు.గతంలో ఎమ్మెల్సీగా పోటీ చేసి మొదటి ప్రాధాన్యత లో అత్యధిక ఓట్లు సాధించాడని ఆయన చెప్పారు. గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీతోపాటు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎలాగైతే సైనికుల వలె శక్తి వంచన లేకుండా పనిచేశారో నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం తుంగతుర్తి నియోజకవర్గం నుండి తీన్మార్ మల్లన్నకు అత్యధిక మెజార్టీని తీసుకురావడానికిశక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఇందుకోసం మండల గ్రామాల వారీగా పట్టభద్రుల వివరాలు సేకరించి వారిని సమన్వయపరిచి ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించాలని కోరారు. రానున్న రోజుల్లో పట్టభద్రులకు వారి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తాను గత ప్రభుత్వంపై వారు చేస్తున్న అవినీతి అక్రమాలపై ప్రశ్నించినందుకే తనపై దాడితోపాటు వందలాది కేసులు పెట్టి జైలు కు పంపారని ఆయన అన్నారు. ఏ రాజకీయ నాయకుడు తన ఆస్తులను ప్రభుత్వానికి అప్పగించని తీరుగా తాను ఇప్పటివరకు తనకున్న స్థిరాస్తులను అప్పగించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి నాలుగు రోజులపాటు కౌంటింగ్ నిర్వహించి బోగస్ ఓట్లతో గెలిచారని మండిపడ్డారు. గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి ఒక్క ఉపాధ్యాయ సంఘాన్ని, నిరుద్యోగులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యర్థులను తనను బేరీజు వేసుకొని భవిష్యత్ తరాలకు ఎవరు అవసరమో వారిని ఎన్నుకోవాలి అన్నారు. తాను ఎన్నటికీ ప్రజల పట్టభద్రుల పక్షాన ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించానని అని చెప్పారు. అనంతరం వారి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గం లో దాదాపు 16 వేల ఓట్ల పైచిలుకు పట్టభద్రులు ఉన్నారని, నియోజకవర్గంలోని ప్రతికాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించాలని, ఈనెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై నరేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మి లాల్, మీడియా ఇన్చార్జి కందుకూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుంకరి జనార్దన్ ,మున్సిపల్ అధ్యక్షులు పేరాల వీరేష్, వివిధ మండల శాఖ అధ్యక్షులు, లింగయ్య యాదవ్, అన్నే బోయిన సుధాకర్, ,లింగమల్లు, బుచ్చి బాబు, తో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతోనే ప్రశాంతంగా ఎన్నికలు

నవతెలంగాణ-కోదాడరూరల్



కోదాడ అసెంబ్లీ సెగ్మెంట్ నుండి నల్గొండ పార్ల మెంట్ ఎన్నికలు విజయ వంతంగా పూర్తిచేసిన అన్ని శాఖల ఉద్యోగులకు ఆర్డిఓ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు అధికారుల సమిష్టి కృషితో ఎన్నికల ప్రక్రియ ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి చేశామని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగిందని ఆయన తెలిపారు. ఓటింగ్ కూడా పార్లమెంటు నియోజకవర్గంలో కోదాడ ద్వితీయ స్థానంలో నిలవడం పట్ల ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తిగా భాగ స్వాములైన కోదాడ అసెంబ్లీ సెగ్మెంట్ లోని అన్ని మండలాల తాసిల్దార్ల, రెవెన్యూ సిబ్బంది ,స్టేట్ లెవెల్ అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ల కృషిని ఆయన అభినందించారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎం) నిరసన



నవతెలంగాణ-రామన్నపేట


అధ్వాన స్థితికి చేరిన రామన్నపేట మండల కేంద్రంలోని రమేష్ మెడికల్ షాపు నుండి మల్లికార్జున రైస్ మిల్ వరకు రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలని సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గుంతల మయంగా మారిన రోడ్డు వద్ద నిరసన వ్యక్తచేసి, అనంతరం ఆర్ అండ్ బి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గాదె నరేందర్, పార్టీ మండల కమిటీ సభ్యులు కందుల హనుమంతు మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు అధ్వానంగా ఉండడం వలన కంకర తేలి గుంతలు ఏర్పడి వాహనాదారులకు, పాదాచారులకు ప్రమాదకరంగా మారిందని వారి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టల శ్రీనివాసు, బోళ్ల వెంకటేశ్వర్లు, భావాండ్లపల్లి సత్యం, ఆముదా ఆంజనేయులు, నకరకంటి సురేష్, గొరిగే మల్లేష్, తరి గొప్పుల వెంకటరెడ్డి, కుందూరు వెంకటేశం తదితరులున్నారు.

కలెక్టరేట్ ఎదుట సూరెపల్లి రైతుల ధర్నా



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. భువనగిరి మండలం సూరెపల్లి గ్రామ రైతులు ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఒకవైపు అకాల వర్షాలకు వడ్లు తడిసి ముద్దవుతున్నాయని, అయినా అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగడం లేదని, ఇప్పటికే వర్షాకాలం సమీపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని తాళం వేసి ఒక్క ఉద్యోగస్తులను లోనికి ప్రవేశించ కుండా ముట్టడిస్తామని హెచ్చరించారు. సుమారు గంటకు పైగా ధర్నా నిర్వహించడం తో డిఎం గోపికృష్ణ అక్కడికి వచ్చి హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూనూరు ఆంజనేయులు, బొడ్డు మైసయ్య, అనంతరెడ్డి, మాధవరెడ్డి లు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఆలేరుటౌను

ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో జూకంటి ప్రేమానందం ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ ఏసి రెడ్డి మహేందర్ రెడ్డి పరామర్శించి, 5000 వేల రూపాయలు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో గుండ్లగూడం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దైద లింగయ్య ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి



నవతెలంగాణ-మోతే

విప్లవోద్యమం ముందుకు సాగాలంటే దైద లింగయ్య ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుడు జతన్ కుమార్ ఆ సంఘం సహాయ కార్యదర్శి పోలబోయిన ముత్తయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నామవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు దైద లింగయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామం వద్ద ఉన్న శ్రీరామ ఫంక్షన్ హాల్ లో ఆయన సంతాప సభను తండు మల్సూరు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామవరం గ్రామంలో భూస్వామ్య బూర్జువా లు 45 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాన్ని అనగదొక్కాలని చూస్తున్న పాలకుల కుట్రలు కుతంత్రాల ను ఎండగడుతూ ప్రజల తరపున అండగా ఉండి పోరాడిన మహా నాయకుడు లింగయ్య అన్నారు .లింగయ్యను కోల్పోవడం నామవరం గ్రామంతో పాటు రాష్ట్ర జిల్లాలో తీరని లోటు అని విచారం వెలిబుచ్చారు రెండుసార్లు గ్రామ సర్పంచిగా ఉంటూ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంతాప సభలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి డి విజేందర్ రావు యుసిసిఆర్ఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సుంకర రమేష్ బాబు గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రం గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకులు పాలకూరి ఎల్లయ్య నాయకులు ఎలిమినేటి సురేందర్ రెడ్డి పుట్ట వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్ ఆర్డీఓ పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నేరేడుచర్ల

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓ పై చర్యతీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ నేరేడుచర్ల మండల శాఖఅధ్యక్ష కార్యదర్శులు వై కృష్ణయ్య, బి. అక్కయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, ప్రిసైడింగ్ ఆఫీసర్ (పిఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఎపిఓ) లకు రోజుకు రూ 600, అదర్ పోలింగ్ ఆఫీసర్(ఒపిఓ) లకు రూ 400 రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 691 ని ఈ నెల 11 న విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పిఓ, ఎపిఓలకు రూ 3150 లు చెల్లించగా, నారాయణఖేడ్ లో 2400 మాత్రమే ఇచ్చారు. రాష్ట్రమంతటా ఒకే విధమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ ,జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు నారాయణఖేడ్లో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని పేర్కొన్నారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాన్ కార్డు పేరుతో ఆగిన ఉపాధి హామీ వేతనాలు

నవతెలంగాణ-మోతే

పాన్ కార్డు లేదని పేరుతో ఉపాధి హామీ కూలీల వేతనాలు ఆపవద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు బుధవారం ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. మండల పరిధిలోని రాఘవపురం నామవరం గ్రామాల ఉపాధి కూలీ వేతనాలు రూ.20 లక్షల ప్రభుత్వం నుండి మంజూరైన కూలీల ఎకౌంట్లో జమ అయినప్పటికీ పాన్ కార్డు లేదని సాకుతో పోస్టల్ అధికారులు నెలలు గడుస్తున్నా కూలీల వేతనాలు పెండింగ్లో పెట్టడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని ,లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించిన ఆర్డీఆర్

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండల పరిధిలోని నారాయ ణగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డుసభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు పాస్టర్ గంటేపంగి ఇమ్మా నుయేలు తల్లి గంటేపంగి మల్లమ్మ మంగళవారం రాత్రి మృతిచెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పూలమాల వేసి బుధవారం నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లమ్మ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ మండలి జ్యోతి పిచ్చయ్య, నారాయణ కృష్ణారెడ్డి, ముఖ్య కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టపల్లి నిత్య అన్నదాన సత్ర నిర్మాణ కమిటీ కార్యదర్శిగా మామిడి రామారావు

నవతెలంగాణ-కోదాడరూరల్



మట్టపల్లి కుమ్మరి నిత్య అన్నదాన సత్ర నిర్మాణ కమిటీ కార్యదర్శిగా మామిడి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన సత్రం నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో కుమ్మరి సత్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాత కమిటీని రద్దుచేసి కొత్త కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్షులుగా గొట్టం సంజీవరావు ఎన్నిక చేసారని తెలిపారు. కుమ్మర సత్రం అభివృద్ధి కోసం కుల సంఘాన్ని చైతన్య పరుస్తూ అందరినీ కలుపుకొని వెళతామని , కమిటీ సహాయంతో అభివృద్ధి చేస్తామని ఆయన తెలియజేశారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నేత లింగయ్య యాదవ్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలనీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల కు రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో ఎన్నికలు మేని ఫెస్టో లో ప్రవేశపెట్టింది రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలి లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బి సి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీల ఓట్ల తోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది బీసీలకు ఇచ్చిన హామీల ప్రకారం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలి అదేవిధంగా మంత్రి పదవులు , నామినేటెడ్ పదవులలో బీసీలకు ఎక్కువ శాతం అవకాశం కల్పించాలి.

నవతెలంగాణ

యాదాద్రి భువనగిరి

గురువారం | మే 16, 2024 | www.navatelangana.com

సాఫ్టు బాల్ జేమ్స్‌లో ప్రథమ బహుమతి



నవతెలంగాణ-అడ్డగూడూరు

మండల పరిధిలోని మానాయికుంట గ్రామానికి చెందిన సురారపు శ్రీకాంత్ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గల సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ బిపిఈడి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మే 9, 10 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ సాఫ్ట్‌బాల్ గేమ్స్‌లో ప్రథమ బహుమతి సధించి నేషనల్‌కి సెలెక్ట్ అయ్యాడు. ఈ నేల 13 నుండి 18 తేదిల్లో బెంగళూర్‌లోని జనతా భారతి బెంగళూర్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయిలో పాల్గొంటున్న శ్రీకాంత్‌కు తల్లి తండ్రులు మరియు బందు మిత్రులు మానాయికుంట గ్రామ ప్రజలు ఆనందం వ్యాక్తం చేశారు. ఇటీవలే టగ్ ఆఫ్ వార్ గేమ్‌లో నేషనల్ ఆడివచ్చి మళ్ళీ నేషనల్‌కి సెలెక్ట్ అయి జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న శ్రీకాంత్‌కు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

రేపు అలేరు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఈ నెల 17న శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఆలేరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంద మల్ల అశోక్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మండల ప్రజ పరిషత్ అభివృద్ధి అధికారి ఎం సత్య ఆంజనేయ ప్రసాద్ మండల కేంద్రంలో బుధవారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలియజేశారు. వ్యవసాయ, విద్యుత్తు, వైద్య ఆరోగ్య, గ్రామీణ నీటి పంపిణీ విభాగం, పశుసంవర్ధక, ప్రాథమిక విద్యా, రెవిన్యూ పౌరసరపరాల అంశం గురించి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి గురించి, ఇందిరా క్రాంతి పథకం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, రోడ్లు భవనాల శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, హార్టికల్చర్ ఉద్యానవన శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, అటవీ శాఖ అధికారులతో సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలంలోని పేరుకుపోయిన ఇతర సమస్యలపై చర్చించనున్నట్లు తెలియజేశారు. సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జెడ్పిటిసి డాక్టర్ కుడుదుల నగేష్‌తో పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలియజేశారు.

స్థానిక ఎన్నికలకు పార్లమెంటు ఫలితాలు సెమీ ఫైనల్

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

జూన్ 4న వెలుబడనున్న పార్లమెంటు ఫలితాల ఓటు బ్యాంకు ఆయా రాజకీయ పార్టీలకు స్థానిక ఎన్నికల్లో సెమీఫైనల్ కానునాయి. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఏయే పార్టీలు కలిసి పోటీచేయాలనే నిర్ణయానికి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు గీటు రాళ్ళుగా మారను న్నాయంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న వామపక్షాలు, కాంగ్రెస్ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపుగా కలిసే పని చేస్తాయనే వాతావరణం గ్రామాల్లో కనిపిస్తోంది. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకొని ప్రజా పాలన పేరుతో ఉత్సాహంతో ముందుకు వెళుతున్న తరుణంలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడం ఆ పార్టీకి మరింత కలిసి వచ్చినట్టు అయింది. అధికారం కోల్పోయి డీలా పడిన బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసిన పరిస్థితిని మనం చూసాం. ఆ పార్టీకి సంస్థాగతంగా ఎక్కువమంది సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలు ఉన్నప్పటికీ తిరిగి అధికారం ఆశిస్తున్న వారు కొందరు కాంట్రాక్ట్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న వారు మరికొందరు బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరుతున్న పరిస్థితి కనబడుతోంది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విషమ ఫలితాలను చూడాల్సిన పరిస్థితి ఉంటుందంటున్నారు.



మునుగోడు నియోజకవర్గంలో టీడీపీ ఇప్పటికే కనుమరుగయ్యింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కలి ఐలయ్య యాదవ్‌తో పాటు పలువురు మండలం అధ్యక్షులు, ముఖ్య నాయకులు అంతా దాదాపుగా కాంగ్రెస్‌లో కలిసిపోయారు. గత పార్లమెంట్ ఎన్నికల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓటు బ్యాంకుగాని సంస్థగతంగా గెలుచుకున్న ప్రజాప్రతినిధుల సంఖ్య గాని చూసినట్లయితే చాలా తక్కువంటున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చే ఓటు బ్యాంకు ఆధారంగానే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలు కలిసి పోటీ చేసేందుకు ఉపయోగపడతాయని ఆయా పార్టీల నేతలు ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ముమ్మర ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలు ఉండగా 16 స్థానాల్లో మద్దతు ప్రకటించిన సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటులో స్నేహపూర్వకంగా పోటీ చేసింది. దీంతో ఇక్కడ సీపీఐ(ఎం)కొంత ఓటు బ్యాంకును చూపించనుంది. ఎక్కడ పోటీ చేయని సిపిఐ స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌పై ఆధారపడాల్సిన పరిస్థితే అంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి పోటీ చేస్తాయా ఒంటరిగా పోటీ చేస్తాయా వేచి చూడాల్సిందే. గత మూడు పర్యాయాలు భువనగిరి పార్లమెంటులో జరిగిన ఎన్నికల్లో 2009లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, 2014లో బీఆర్ఎస్‌కు చెందిన బూర నర్సయ్యగౌడ్, 2019లో కాంగ్రెస్‌కు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపొందారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఆయా పార్టీలకు పోలైన ఓట్లను పరిశీలించినట్లయితే..

సంవత్సరం.	అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు
2009 ఎన్నికల్లో ..	కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి	కాంగ్రెస్	5,04,193
	నోముల నర్సింహయ్య	సీపీఐ(ఎం)	3,64,215
	చంద్రమౌళి	పీఆర్పీ	1,04,873
	చింత సాంబమూర్తి	బీజేపీ	45,898
2014 ఎన్నికల్లో ..	బూర నర్సయ్య గౌడ్	బీఆర్ఎస్	4,48,245
	కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి	కాంగ్రెస్	4,17,751
	నల్లూరి ఇంద్రసేనారెడ్డి	బీజేపీ	1,83,217
	చెరుపల్లి సీతారాములు	సీపీఐ(ఎం)	54,035
2019 ఎన్నికల్లో ..	కోమటిరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్	5,32,795
	బూరనర్సయ్య గౌడ్	బీఆర్ఎస్	5,27,573
	పీవీ శ్యాంసుందర్రావు	బీజేపీ	65,457
	గోద శ్రీరాములు	సీపీఐ	28,153



లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలి

- ప్రభుత్వం స్పందించకపోతే మేమే గృహప్రవేశం చేయిస్తాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సింగన్నగూడెం వద్ద 2015లో శంకుస్థాపన చేసి నిర్మించిన 565 డబల్ బెడ్‌రూమ్‌లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం సింగన్నగూడెంలోని డబల్ బెడ్ రూమ్‌లను పరిశీలించి పనుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. ఓట్ల రాజకీయాలతో వారికి పట్టాలు ఇచ్చినా.. ఇండ్లు కేటాయించలేదన్నారు. కోట్ల రూపాయల సంపదతో నిర్మించిన డబల్ బెడ్ రూమ్‌ల వినియోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తపరిచారు. త్రాగునీరు, డ్రెయినేజీ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. డబల్ బెడ్‌రూమ్‌ల వద్ద రక్షణ లేకపోవడంతో ఆ ఇంటి కిటికీలను డోర్లను దొంగలు ఎత్తుకుపోతున్నారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులు నామమాత్రంగా పరిశీలించారే తప్ప పరిష్కరించలేదన్నారు. డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఐక్యం చేసి నిరసన తెలుపడంతో పాటు ఆ గదులను వాటికి పట్టాల ప్రకారం కేటాయించి గృహప్రవేశం చేయిస్తామని హెచ్చరించారు. దీంతో సంపద నష్టపోకుండా ఉండడమే కాకుండా వినియోగంలోకి వస్తుందని జహంగీర్ తెలిపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధలు మాట్లాడుతూ డబల్ బెడ్‌రూమ్ కాలనీకి ప్రభుత్వం నుండి వెంటనే నిధులు కేటాయించి డ్రైనేజీ తాగునీరు ఏర్పాటు చేసి వెంటనే లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలన్నారు. లబ్ధిదారుల కేటాయించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో వారికి కేటాయించి గృహప్రవేశం చేయిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వము ఎమ్మెల్యేలు ఈ విషయంపై స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, మండల కార్యదర్శి దయ్యాల నరసింహ, నాయకులు బందెల ఎల్లయ్య, అన్నంపట్ల కృష్ణ, చింతల శివ పాల్గొన్నారు.



మురుగు నీరు తొలగింపుకు శాశ్వత చర్యలు

- మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మున్సిపల్ పరిధిలోని (కెసిఆర్ కాలనీ) బీహెచ్‌కెలో మురుగునీరు తొలగింపుకు శాశ్వత చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య అన్నారు. ఆలేరు పురపాలక సంఘంలో బుధవారం కాలానీవాసులు సుమారు100 మంది చైర్మెన్ శంకరయ్యని కలసి, మురుగు నీరుకు అవుట్ లెట్ సాకర్యం లేక సమస్యతో కాలనిలో దూర్వసనతో ఇబ్బందులు పడుతున్నామని, మురుగు నీరు కు అవుట్ లెట్ సమస్య తక్షణమే పరిష్కారం చేయాలనీ వినతి పత్రం అందజేశారు. వెంటనే సప్పందించిన మున్సిపల్ చైర్మన్ శంకరయ్య (కెసిఆర్ కాలనీ) చేరుకొని సమస్యను చూసి,మురుగు నీరు పోవుటకు అవుట్ లెట్ చేపించి, శాశ్వత పరిష్కారం జరిగేల చూస్తానని కాలనీ వాసులకు తెలియజేశారు. కాలానీవాసులకు మోరిలలో ఇలా చెత్త చెదారం పడకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రుల్లో అధికారుల తనిఖీ

- నవతెలంగాణ కథనానికి స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ

నవతెలంగాణ-భువనగిరి

'అవసరం లేకున్నా ఆపరేషన్లు' అంటూ నవతెలంగాణలో.. ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఆర్థిక ప్రయోజనాల కోసం తొలిచూరు కాన్పులో అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారని మే 8న వార్తా కథనం వచ్చింది. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా అధికారులకు తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎట్టకేలకు జిల్లా వైద్యాధికారులు బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. వారికి హెచ్చరిక జారీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వై పాపారావు నేరుగా ఆస్పత్రుల రిజిస్టర్‌లను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఆ ఆసుపత్రులు సీజ్ చేస్తారని హెచ్చరించారు.



కడుపు కోతలు వద్దు.. సాధారణ ప్రసవాలే ముద్దు

తెలంగాణ రాష్ట్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, ప్రోగ్రామాధికారుల బృందం భువనగిరిలోని జయలక్ష్మి హాస్పిటల్, నిర్మల హాస్పిటల్ మరియు కేకే ప్రైవేటు నర్సింగ్ హోమ్ ఆస్పత్రులలో అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వై. పాపారావు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో నిబంధనకు విరుద్ధంగా చాలా ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ కాన్పులు తగ్గించి సిజేరియన్ కాన్పుల్ ఎక్కువగా చేస్తున్నారన్నారు. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనకు వ్యతిరేకం అన్నారు. తగిన కారణాలు లేకుండా సిజేరియన్ చేసినచో కఠిన చర్యలు ఉంటాయన్నారు. వైద్యబృందం తిరిగి మూడు ఆసుపత్రుల్లో రిపోర్టు పేషంట్‌కే సీట్లు పరిశీలించారు. వీటిలో కొన్ని కాన్పులకు సరైన కారణాలు పొందుపరచలేదని వీటి విషయంలో ముందుగా నోటీసులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు ప్రిన్స్ ఆసుపత్రి, గాయత్రీ హాస్పిటల్, మహేంద్ర ఆసుపత్రిలకు నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. ఆస్పత్రుల వివరణ అనంతరం కలెక్టర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఉమ్మనీరు పెంచుకోవడానికి రక్తం తగినంత ఉండేలా చూసుకోవడానికి వైద్యుల సూచనలు మేరకు ఆహార పదార్థాల ద్వారా పొందాలన్నారు. తదుపరి మూడు రోజులు జిల్లాలో సిజేరియన్ ఆపరేషన్ చేస్తున్న ఆసుపత్రిలో తనిఖీలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డా. శిల్పిని, డా. యశోద, ప్రోగ్రాం అధికారులు డా. సుమన్ కళ్యాణ్, డెమో మధుసూదన్ రెడ్డి, సిహెచ్ఓ నగేష్ మరియు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన హమాలీ కార్మికున్ని ఆదుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం

నవతెలంగాణ-రామన్నపేట



హమాలీ పని చేస్తూ ప్రమాదవశాత్తు తీవ్ర గాయాల పాలైన హమాలీ కార్మికుని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో హమాలి పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు లారిపై నుండి క్రిందపడి తీవ్ర గాయాల పాలైన తరాల నరసింహను సీఐటీయూ మండల కమిటీ బృందంతో కలుసుకొని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గాయపడిన హమాలి కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని, భవన కార్మికులకు మాదిరిగా హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకెపి సెంటర్లో పని చేస్తూ గాయపడిన తరాల నరసింహ వైద్య ఖర్చులను తను కోరుకునే వరకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తహసిల్దార్, వెలుగు ఆఫీసు సీసీకి వినతిపత్రం అందజేసిన ఇంతవరకు స్పందన లేదని ఆయన విమర్శించారు. ఇకముందు స్పందించకుంటే త్వరలో జిల్లా కలెక్టర్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగే సోములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మేడమైన శ్రీనివాస్, వేముల సైదులు, వల్లమల్ల నరసింహ, చెన్నబోయిన సత్యనారాయణ, కన్నెబోయిన యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నని గెలుపునకు కలిసికట్టుగా పని చేయాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

వరంగల్, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి బుధవారం కార్యకర్తలను కోరారు. ఆలేరు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సి అభ్యర్థి తీన్మార్ మలన్నతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆలేరు పట్టణం, మండలం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ నెల27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు నాయకులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పోటీగా ఎక్కడాలేరన్నారు. ఎంపీగా చామల కిరణ్ కుమార్ కోసం గేలుపు కోరుతూ పని చేశారని, ఇప్పుడు ఎమ్మెల్సీ గా తీన్మార్ ను గెలిపించటం కోసం పనిచేసి భారీ మెజార్టీ గెలిపించుకోవాలన్నారు. ఎంపీ చామలతో తీన్మార్ మలన్న ఆధ్వర్యంలో మరిన్ని నిధులు తీసుకుని వచ్చి ఆలేరును అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు

- మండల వ్యవసాయ అధికారి మంజుల

నవతెలంగాణ-రామన్నపేట

పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు స్థానిక పీఏసీఎస్‌లో, ఆగ్రో సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మంజుల బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తుకున్న పచ్చిరొట్ట పంటను 30 నుండి 40 రోజులప్పుడు పూత దశలో నేలలో కలియదున్నాలన్నారు. తద్వారా నేలలో పోషకాలు, సేంద్రియ పదార్థం పెంపొందుతాయని ఆమె తెలిపారు

లారీల కొరతతో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

నవతెలంగాణ-మోటకొండూర్

మండలంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు ఎక్కడికక్కడ నిలిచిపోయి స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొదటి నుండి లారీలు, హామలీల కొరత ఉందని విన్నవించుకున్న పట్టించుకునేవారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం వర్షానికి తడిచి, ఎండకు ఎండి నిరుపయోగంగా మారుతుందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నిరుపయోగంగా మారటం చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రేమ వివాహం.. రెండున్నర నెలల వ్యవధిలో ఇద్దరూ ఆత్మహత్య !

- కులాలు వేరు కావడంతో వేధింపులే కారణమని అనుమానం



ఫైల్ ఫొటో..

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్/బీబీనగర్

కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న ఓ నవజంట రెండున్నర నెలల వ్యవదిలోనే ఇద్దరూ ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు భువనగిరి మండలంలోని చీమల కొండూరు గ్రామంలో చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిట్కూరి మనోహర్ కురుమ(23) (బీసీ), అదే గ్రామానికి చెందిన ఎస్సీ అమ్మాయి సుమారు రెండున్నర నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం అమ్మాయి అబ్బాయి వాళ్ళ ఇంట్లో కాపురం చేసే సందర్భంలో మార్చి 8వ తేదీన మృతి చెందింది. మృతి చెందిన వెంటనే మనోహర్ రాత్రి పురుగుల మందు సేవించాడు. కానీ చికిత్స చేయడంతో బతికి బయటపడ్డాడు. కాగా అమ్మాయి మృతికి అబ్బాయి తల్లిదండ్రుల వేధింపులే కారణమని కేసు నమోదు కావడంతో అబ్బాయితో పాటు ఇద్దరు తల్లిదండ్రులు నల్గొండ జైలుకు తరలించారు. రెండున్నర నెలలు జైలుశిక్ష అనుభవించారు. కాగా ఇటీవలనే పది రోజుల క్రితం జైలు నుంచి రిలీజ్ అయ్యారు. కాగా తల్లిదండ్రులు భువనగిరి మండలం చీమల కొండూరులో నివాసం ఉంటుండగా, వారి కుమారుడు మనోహర్ బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామంలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. కాగా సోమవారం మండల కేంద్రంలో ఎంఎస్ఎన్ కంపెనీ వెనకాల మంగళవారం సాయంత్రం ఉరివేసుకొని చనిపోయాడు. బుధవారం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామం చీమల కొండూరులో జరగనున్నాయి. కాగా మృతికి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదు. జైలు జీవితం అనుభవించి మనస్థాపానికి గురై చనిపోయాడా, లేదా ఎవరైనా చంపేసి ఉంటారా అని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్



నవతెలంగాణ-బీబీనగర్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయారు. బుధవారం మండలంలోని వెంకిర్యాల, పల్లెగూడెం, గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డ్‌ను పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించనారు. సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని మండపడ్డారు. కేంద్రాల వద్ద ధాన్యము రాశులు వర్షానికి తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని అన్నారు. ఇకనైన ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వీడాలని అన్నారు. రెండు నెలలు గడుస్తున్న నేటికీ 50 శాతం కొనుగోలు చేయకపోవడం దారుణమని అన్నారు. రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తు ధాన్యాం రాశులకు పట్టాలు కిరాయికి తెచ్చుకొని అధిక ఆర్థిక భారాన్ని భరిస్తున్నారని అన్నారు. కావున ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు బండారు శ్రీరాములు, మంద యాదగిరి, ఆకుల నరసింహ, నక్కిర్తి అశోక్, నక్కిర్తి నర్సింహ, తలారి బుచ్చమ్మ, ఆకుల శ్రీనివాస్, చింతకింది బుచ్చయ్య, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా.. హైమాస్ట్ లైట్ స్తంభాలు

- లక్షలు పోసి నిర్మించి లక్షణంగా వదిలేశారు
- వెలిగినన్ని రోజులు వెలిగాయి.. ఆ తర్వాత పట్టించుకోని వైనం

నవతెలంగాణ-రామన్నపేట

లక్షలాది రూపాయల ప్రజాధనంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలోని కూడలి ప్రాంతాలలో అత్యంత ఎత్తుగా ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లు నాడు గ్రామాలలో నలువైపులా వెలుగులు విరజిమ్మాయి. గ్రామాలకు కొత్త శోభ వచ్చిందనడంలో సందేహమే లేకుండే.. కానీ కొన్నాళ్లకు వాటికి రిపేరు రావడంతో రిపేర్ చేసి పెట్టడంలో పాలకులు, అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహించడంతో గ్రామాలలో ఎత్తుగా ఏర్పాటుచేసిన స్తంభాలు వచ్చి పోయే వారికి దిష్టిబొమ్మల కనిపిస్తున్నాయని గ్రామాలలో చర్చ సాగుతోంది. ఆ తర్వాత వచ్చిన పాలకులు వాటి మరమ్మతుపై దృష్టి పెట్టకపోవడంతో ఆనాటి వెలుగులు చీకట్లో కలిసిపోయాయని చెప్పక తప్పదు. ఈ హైమాస్ట్ లైట్లను మండల కేంద్రంతో పాటు లక్ష్మాపురం, సిరిపురం, వెల్లంకి, శోభనాద్రిపురం, మునిపంపుల, ఎన్నారం, ఇంద్రపాలనగరం, పల్లివాడ, బోగారం, ఇస్కిల గ్రామాలలో 10,12 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. మండలంలోని భోగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖ వ్యాపారి కూనూరు సాయికుమార్ తన సొంత నిధులతో నూతన లైట్లు బిగించి వెలిగించారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో మూడు చోట్ల ఉన్న హైమస్ట్ లైట్లను తాజా మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి మరమ్మతు చేసి బిగించారు.



శోభనాద్రిపురం గ్రామంలో సుమారు తొమ్మిది, పదిచోట్ల తాజా మాజీ సర్పంచ్ ఏర్పాటు చేసిన హైమాస్ట్ మరమ్మతులు చేసి వెలుగులు అందేలా చేశారు. మిగతా గ్రామాలలో పట్టించుకోని మరమ్మతులు చేయకపోవడంతో హైమాస్టలైట్ల స్తంభాలు లైట్ల వెలుగులు లేక వెలవెలబోతూ కనిపిస్తున్నాయి. గతంలో గ్రామాలలో వెలుగులు నింపిన హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేసి గ్రామాలలో వెలుతుర్లు నింపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రిపేర్లు భారంగా మారడంతో....

వెలిగినన్ని రోజులు మంచి వెలుతురులు అందించిన హైమస్ట్ లైట్లు కొన్నాళ్ళకి చెడిపోయి రిపేరుకు రావడంతో పలుమార్లు మరమ్మతులు చేయించి బిగించిన్నాం. మరమ్మతు ఖర్చులు చిన్న చిన్న గ్రామపంచాయతీలు భరించలేక వదిలేసారని కొందరు తాజా మాజీ సర్పంచులు పేర్కొన్నారు.



PABBA BHAVYA SRI



PAKALA SAHASRA



MUDDAM DIVYA SAI

కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల హవా

నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

భువనగిరి కేంద్రీయ విద్యాలయంలో సోమవారం వెలువడిన ఫలితాల్లో 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 39 మంది ఉత్తీర్ణులయ్యారని అన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించారని కేంద్రీయ విద్యాలయ భువనగిరి ప్రిన్సిపాల్ ఎన్ చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మార్కులకు గాను ఐదుగురు విద్యార్థులు 400కు పైగా మార్కులు సాంధించారని, మొదటి టాపర్‌గా పబ్బ భవ్యశ్రీ 445 మర్కులు, 2వ టాపర్‌గా పాకాల సహస్ర 444 మర్కులు, 3వ టాపర్ ఎం.దివ్యసాయి 432 మార్కులు పొందారని తెలియజేశారు. నేషనల్ హైవే 163 భువనగిరిలో కొత్త భవనం సిద్ధమైనదని తెలిపారు. వచ్చే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఎక్కువ మర్కులు సాధించాలని భావిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు సన్మానించామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | మే16. 2024 | www.navatelangana.com

పెట్రోలు పంపిణీలో మోసమంటూ వాట్సాప్‌లో పోస్టు

నవతెలంగాణ-ఆలేరుటౌన్




ఆలేరు పట్టణంలోని భారత్ పెట్రోల్ బంకులో మోసం జరుగుతుందని ఎల్ఐసి ఏజెంట్ మూధం మల్లేశం మండల కేంద్రంలో బుధవారం వాట్సాప్ ద్వారా ఒక ప్రకటనలు తెలిపారు. తాను మధ్యాహ్నం 12 గంటలకు రూ.250 పెట్టి రెండు లీటర్లు బైక్‌లో పెట్రోలు పోయించుకున్నానని బండి 31 కిలోమీటర్లు వరకే వెళ్లిందని ఆరోపించారు. దీనిపై భారత్ పెట్రోల్ బంక్ యజమాని కె హనుమంతరావును వివరణ కోరగా బంకులో అలాంటి తప్పిదాలు జరిగేందుకు అవకాశం లేదని, కస్టమర్ ఆరోపణపై సిబ్బందిని విచారించానని తెలియజేశారు. స్థానికంగా తాను లేనని వాస్తవం నిరూపించేందుకు తాను సిద్ధమన్నారు.

సీపీఐ(ఎం)కు మద్దతు తెలిపిన ఓటర్లకు కృతజ్ఞతలు

- పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు

నవతెలంగాణ-మోత్కూర్



సీపీఐ(ఎం) అభ్యర్థికి మద్దత్తు పలికి, పార్టీ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఓటరుకు, పార్టీ కార్యకర్తలకు మండల కమిటీ సభ్యులకు, ఓటేసి ఆదరించిన ప్రజలకు, సహాయ సహకారం అందించిన, పత్రికా ప్రతినిధులకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన బుధవారం మోత్కూర్‌లో పత్రికా ప్రతినిధిలతో మాట్లాడారు. డబ్బు, మద్యం, విచ్చలవిడి పంపిణితో, ప్రజలను ప్రలోబాలకు గురిచేసే, నీచ రాజకీయాలకు బూర్జువా పార్టీలు ఒడికట్టాయని అన్నారు. గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఇదే స్పూర్తితో భవిష్యత్ లో పార్టీ నిర్మాణానికి, బలోపేతానికి కృషి చెయ్యాలని కోరారు.

అడుగంటుతున్న కృష్ణమ్మ

- మూడు దశాబ్దాలలో చూడని తీరు
- పిల్లకాలువలా నీటి ప్రవాహం
- ఎండిపోయిన చెరువులు-కుంటలు



నాడు కృష్ణానదిలో నీరు

నవతెలంగాణ-మఠంపల్లి

'బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేనూ బంగారు పంటలే పండుతాయి'అని కృష్ణమ్మ పరవళ్లపై కవిపాట ఎంతో మధురం. నేడు కృష్ణమ్మ మూగపోయి పిల్లకాలువలా దర్శనమిస్తుంది. లక్షలాదిఎకరాలకు సాగునీరు, కోట్లాది మంది ప్రజలకు తాగునీరు అందించే కృష్ణానది వెలవెల పోతుంది.చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి క్రికెట్ గ్రౌండ్‌లా కనిపిస్తున్నాయి. అడుగంటిపోతున్న నీటి జలాలపై ప్రత్యేకకథనం. ఏయేడు కా ఏడు ప్రకృతి వికృతంగా మారుతుంది. వర్షాలు లేకపోవడం, ఎండలు తీవ్ర స్థాయిలో ఉండటం, అడవులు, చెట్లు, చేమలు నరికివేతకు గురికావడం వెరసి కరువు కాటకాలకు దారి చూస్తుంది. అన్నంపెట్టే రైతన్న వర్షాలు రాక,కృష్ణ నీరు లేకపోవడంతో రెండు ఎండ్లుగా బోర్లు,బావులపై ఆధారపడి వ్యవసాయం నెట్టుకొస్తు న్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సాగర్, మిర్యాలగూడ, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాలకు కృష్ణనది ఎడమకాలువ నీరేఆధారం. రైతులకు వరప్రదాయినిగా ఉండే కృష్ణమ్మ నేడు వెలవెల పోతుంది.మూడు దశాబ్దాల కాలంలో



ప్రస్తుతం ఎండిపోయిన ఉన్న దృశ్యం

ఇటువంటి దుస్థితి ఏనాడు చూడలేదంటు న్నారు.చెరువులు, కుంటలు,బావులు, బోర్లు పూర్తిగా అడుగంటిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గం లోని యాతవాకిళ్ల వద్దవున్న వేములూరుప్రాజెక్టు వేలాది ఎకరాలకు నీరందించే ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయే దశకు వచ్చింది. ఈ తరుణంలో చిన్నవాన పడితేనే ప్రజలు ఎంతోఆనందిస్తున్నారు.వాతావరణ అధికారులు చెబుతున్న విధంగా ఈ ఏడు వర్షాలుబాగా కురుస్తాయనే ఆశాభవంతో రైతాంగం,ప్రజలు చూస్తున్నారు.



చెరువులో .. గోకుల్ దమం వెంచర్ బీటీ రోడ్డు ఏర్పాటు

- తొలగించిన ఐబీ రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

జాతీయ రహదారి 65 కు ఆనుకొని మండల పరిధిలోని గోపాలపల్లి గ్రామ శివారులో రోడ్డుకు. ఎదురు గల 581, 585 586 సర్వే నెంబర్లు గల చెరువు భూమిలో అక్రమంగా గోకుల్ దమం వెంచర్ యాజమాన్యం రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తుండగా.. ఐబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమ రెండు రోజుల క్రితం రోడ్డు వేయొద్దని హెచ్చరించారు. ఐబీ అధికారులు చెరువు పరిశీలనలో భాగంగా బుధవారం ఆ స్థలాన్ని సందర్శించారు. ఐబీ అధికారుల హెచ్చరికలు పాటించకుండా సదరు వెంచర్ యజమాని బీటీ రోడ్డు వేయడంతో ఐబీ, రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి బుధవారం 80 మీటర్ల చెరువు స్థలం బఫర్‌జోన్‌లో ఉండడంతో బీటీ రోడ్డును తొలగించినట్లు ఐ.బి డీ ఈ విఠలేశ్వర్ పేర్కొన్నారు. చెరువులో బఫర్ జోన్ పరిధిలో రోడ్డు వేసిన స్థలముందని, బఫర్ జోన్ ఉన్నంతవరకు రోడ్డును తొలగించినట్లు పేర్కొన్నారు. చెరువును ఆక్రమిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. రోడ్డు తొలగింపు కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వరరావు , ఐబి ఏ.ఈ రమ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

- ఏఆర్వోలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని
- అనుమతులు మాన్యువల్ గా ఇవ్వాలి
- ఎఫ్ఎస్టి టీమ్స్ కొనసాగుతాయి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



వరంగల్ ఖమ్మం నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహణకు బ్యాలెట్ బాక్స్ లను సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన వెల్లడించారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి వరంగల్,ఖమ్మం,నల్గొండ శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కురిటర్నింగ్ అధికారి, నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో పాటు, నియోజకవర్గ పరిధిలో ఉన్న 12 జిల్లాల ఏఆర్వో లు, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి హాజరయ్యారు. ఈ శాసన మండలి ఉప ఎన్నికలో బ్యాలెట్ బాక్స్ లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ పై పలు సూచనలు చేశారు.శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన విషయాలపై, పాటించకూడని అంశాలపై అభ్యర్థులకు జరిగిన సమావేశంలో అవగాహన కల్పించామని రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఎన్నికల సంఘం అధికారులకు తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ లకు సంబంధించి ఏఆర్వోలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మాన్యువల్‌గా ఇవ్వాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల లాగానే ఎఫ్ఎస్టి టీమ్స్ కొనసాగుతాయని తెలిపారు. అదనపు ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్,లోకేష్ కుమార్,డిప్యూటీ సిఈఓ సత్యవాణి పాల్గొనగా, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మిర్యాలగూడ ఆర్డిఓ, ఏఆర్ఓ శ్రీనివాసరావు, చండూరు ఆర్డిఓ, ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



మానసిక వికలాంగుల ఆశ్రమానికి సాయం

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని కక్కిరేణి గ్రామంలో కన్స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్ మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) ఆధ్వర్యంలో బుధవారం అక్షరా కిరాణం నార్కట్‌పల్లి అనాధాశ్రమానికి ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వేముల సైదులు మాట్లాడుతూ ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడమే నిజమైన సేవ అని ఆయన అన్నారు. సీఐడీసి కక్కిరేణి టైలరింగ్ సెంటర్ లో ఉన్న మహిళల సహకారంతో అనాదాల ఆకలి తీర్చడం కోసం కృషి చేసిన వారి సేవలు అభినందనీయమని, చిన్న ప్రయత్నమే పెద్ద మార్పుకు దారి తీసే విధంగా ప్రయత్నిస్తే సాధ్యం కానిది లేదని, మతిస్థిమితం లేని అనాధలను ఆదరించే విధంగా మానవత దృక్పథంతో ఇక ముందు కూడా మరిన్ని ఇతర సేవా కార్యక్రమాలు ఇలాగే నిర్వహించుటకు యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అక్షరాకిరణం కోఆర్డినేటర్ మేదరి కిరణ్ కుమార్, యాదాద్రి భువనగిరి సీఐడీసీ ఇన్స్ స్పెక్టర్ మెట్టు మధు, టైలరీంగ్ డెమో కన్నెబోయిన నవ్య, అనంతల విజయలక్ష్మి, కనకమ్మ, భార్గవి, పుష్పమ్మ నర్మద, కావ్య, సైదమ్మ పారిజాత, భారతమ్మ వరలక్ష్మి, రాధ, సంతోష, అనిత, సంధ్య, మమత, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం, నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టబధ్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా గెలుపుకు కృషి చేస్తామన్నారు. యూత్ కాంగ్రెస్ పాత్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్య భూమిక పోషిస్తుందని యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉట్కూరి సురేష్ అన్నారు. ఈ కార్యక్రమం మంథనపల్లి గ్రామ మాజీ వార్డు మెంబర్ కడకంచీ రాజు, ఆలేరు మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యర్థులకు చుక్కలు చూపించిన సీపీఐ(ఎం) అభ్యర్థి

- జహంగీర్ సవాళ్లకు స్పందించని అభ్యర్థులు
- అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదుతో తీవ్ర ఉత్కంఠ

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఫైల్ ఫోటో

లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని భువనగిరి పార్లమెంట్ స్థానంలో సీపీఐ(ఎం) పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ ప్రాధాన్య పార్టీ అభ్యర్థులకు తన ఉధృతమైన ప్రచార తీరుతో, వాగ్దాటి పటిమతో ఎన్నికల సందర్భంగా ప్రచార సమయంలో చుక్కలు చూపించారు. అభ్యర్థులకు ప్రజా సమస్యలపై, పార్లమెంటు పరిధి అనే అంశంపై, నేను గెలిస్తే ప్రజలకు సేవ చేస్తానని, మీరు గెలిస్తే వ్యాపారం చేస్తారని అభ్యర్థులకు సవాల్ విసిరినప్పుడు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు స్పందించని వైనం సోషల్ మీడియాలో ప్రతి ఓటరు గమనించాడు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఒక సందర్భంలో భువనగిరి పార్లమెంట్ పరిధిలో సమస్యలు తెలియవని, అసలు భువనగిరి పార్లమెంటు పరిధి ఏమిటో కూడా అభ్యర్థులకు తెలవదని ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని, వీరు గెలిస్తే వ్యాపారాలు పెంచుకుంటారని, ప్రజా సమస్యలు తీర్చారని సవాలు విసిరారు. ఈ సవాళ్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు పార్టీ సభ్యులు, అభిమానులు, స్టేటస్లు పెట్టుకుని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం నిర్వహించారు.

ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు సవాళ్లకు స్పందించకపోవడంతో, సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ నైతికంగా ప్రజల ముందు అప్పుడే గెలిచినట్లు అయ్యింది. భువనగిరి పార్లమెంట్ ఎన్నిక ప్రక్రియ సోమవారం రాత్రి వరకు ముగిసింది. భువనగిరి సమీపంలోని ఆరోరా కళాశాలలో రాత్రి పొద్దుపోయే వరకు ఎన్నికల అధికారులు పోలీసుల భద్రత మధ్య ఈవీఎంలను భద్రపరిచారు. ఎన్నికల అధికారుల సూచనలతో స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పోలీసులు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికలు జరిగినప్పటికి విశేషంగా భువనగిరి పార్లమెంటు స్థానంలో అత్యధికంగా ఓటింగ్ శాతం 72.33శాతం నమోదైనది. ఓటర్లకు ఆయా పార్టీలకు చెందిన నాయకులు కిరాయి, రవాణా ఖర్చులు , ఇతర ఖర్చులకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఓటర్లు రా కా పో వ డా ని కి కారణాలుగా తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నిక ముందు రోజు రాత్రి ఆదివారం ఒక పార్టీకి చెందిన నాయకులు మందు మనీ పంచినట్లు పలువురు మద్యం డబ్బులు అందని ఓటర్లు పేర్కొన్నారు. కాలు చూసి బొట్టు పెట్టినట్టు వారికి నచ్చిన వారికి మాత్రమే డబ్బులు మద్యం పంపిణీ జరిగినట్లు చెబుతున్నారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీయంలో ఉండడంతో భువనగిరి పార్లమెంటు స్థానంలోని అభ్యర్థులకు, వివిధ పార్టీలకు చెందిన పార్టీ సభ్యులకు, ప్రజలకు ఉత్కంఠ నెలకొంది. ఫలితాలు విలువడే వరకు ఉత్కంఠ తప్పదు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండలంలోని కొలను పాక గ్రామంలో 13వ వార్డుకు చెందిన మహిళలు గత కొన్ని రోజులుగా సకాలంలో మంచినీరు అందడం లేదని, నీటి సమస్య కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఏప్రిల్ నుండి మంచినీరు సక్రమంగా అందలేదని, గత15 రోజులు నుండి నీటి ఎద్దడి తీవ్రతరమైందని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య పరిష్కరించాలని, అధికారులు స్పందించాలని నినాదాలు చేశారు. మండల ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో 13వ వార్డుకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పెరుగిపోతున్న దొంగతనాలు

- వలిగొండ, భువనగిరి బస్టాండ్‌లో పెరిగిన బైకు, సెల్‌ఫోన్ల దొంగతనాలు
- పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



గతంలో ఎండాకాలంలో ఆరు బయట నిద్రించే మహిళలు, ఒంటరి మహిళలపై చోరీలకు పాల్పడుతూ చైన్ స్నాకింగ్ దొంగతనాలకు పాల్పడేవారు. ప్రస్తుతం దొంగలు రూటు మార్చి బస్టాండ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం రద్దీగా ఉన్నప్పుడు బస్సు ఎక్కిదిగే సందర్భంలో దొంగలు చాకచక్యంగా వారి పర్సులను, డబ్బులను దొంగిలిస్తున్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికులే దొంగల టార్గెట్..

యాదాద్రి భువనగిరి జిల్లాలో చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట ప్రాంతాలలో ప్రయాణికులు రద్దీగా ఉండే సమయంలో దుండగులు వారి యొక్క పర్సును నగదును కొట్టివేస్తున్నారు. బస్టాండ్లలో ఇటీవల కాలం ఉచిత బస్సు కావడంతో మహిళ ప్రయాణికులు ఎక్కువగా ఉండడం, మగవారికి సీట్లు దొరకకపోవడంతో ఆడ మగవారు సీట్ల కోసం కుస్తీ పడుతూ బస్సు ఎక్కి సందర్భంలో దుండగులు చాకచక్యంగా పర్సులను దొంగలిస్తూ, చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నార్కట్పల్లి, వలిగొండ, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, భువనగిరి, చిట్యాల ప్రాంతాలలో సెల్‌ఫోన్ దొంగతనాలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరిగినట్లు సమాచారం. ఈ విషయంపై కొందరు ఫిర్యాదు చేయగా, మరికొందరు ఫిర్యాదు చేయకుండానే వెళ్ళిపోతున్నారు. సెల్ఫోన్ పోగొట్టుకున్న వారు స్థానికులు కాకపోవడంతో సెల్‌ఫోన్‌కు సంబంధించిన సమాచారం ఐఎంఈఐ నెంబర్ ఇంటి వద్ద ఉండటంతో మళ్లీ వచ్చి ఫిర్యాదు చేస్తే దొరుకుతుందో లేదో, సెల్ఫోన్ బస్సు ఎక్కినప్పుడు పోయిందా బస్సు దిగేటప్పుడు పోయిందా తెలియక ఈ మండలంలో కంప్లైంట్ చేయాలో కూడా అర్థం కాక కొంతమంది ఫిర్యాదు చేయకుండానే వెళ్ళిపోతున్నారు.

మార్చి నుంచి మే వరకు దొంగతనం జరిగిన కొన్ని ఘటనలు..

యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి వలిగొండ బస్టాండ్ లో ఇటీవల కాలంలో పర్స్ దొంగతనాలు, బైకు దొంగతనాలు పెరిగిపోయాయి. మార్చి నెల 29వ వలిగొండ బస్టాండ్‌లో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం సంగుపెల్లి గ్రామానికి చెందిన భాగమల్ల ఐలయ్య యాదాద్రి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మార్చి 29వ తేదీన బస్సు ఎక్కే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సెల్ ఫోన్ దొంగిలించి, అతని బ్యాంక్ అకౌంట్‌లో నుంచి రూ.76,250 నగదు డ్రా చేశాడు. ఈ విషయంపై బాధ్యతలు వలిగొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

వలిగొండ మండల కేంద్రానికి చెందిన గ్రంథాలయ నిర్వాహకుడు పిట్టల ఆంజనేయులు వలిగొండలో బస్సు నిలిచే సమయంలో అక్కడ ఉండగా అతని సెల్ ఫోన్ దొంగిలించారు. ఆయనతోపాటుగా పాత్రికేయుల సెల్ ఫోన్లు వలిగొండ దొంగలించబడ్డాయి. చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్‌లో మార్చి మే నెలలో ఐదు సెల్ ఫోన్లు దొంగిలించబడ్డాయి. భువనగిరిలో ఇటీవల కాలంలో సుమారు 15 మంది పర్సులు కొట్టివేసినట్లు బాధితులు తెలిపారు. మార్చి 14వ తేదీన సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ తనకు సంబంధించిన బైకులు బస్టాండ్ పక్కన పెట్టి పేపర్ చదవడానికి ఆర్టీసీ క్యాంటీన్లో కూర్చొని అరగంటలో తిరిగి వచ్చి చూసేసరికి అతని బైకులు దొంగిలించారు. మే 11వ తేదీన భువనగిరి నుంచి ఒక పాత్రికేయుడు రాయగిరికి వెళుతుండగా అతని పర్సును కొట్టివేశారు.

పనిచేయని సీసీ కెమెరాలు..

భువనగిరి బస్టాండ్‌లో సీసీ కెమెరా ఉన్నప్పటికీ పనిచేయకపోవడంతో ముఖ్యంగా మహిళలు రద్దీగా ఉండడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రయివేటు వాహనాలు, ఆటోలు, బస్సులతో పాటుగా ఉండడం మనం ఫోటోలో గమనించవచ్చు. భువనగిరి బస్టాండ్.. ఆటో స్టాండ్ అనిపించేలా ఆటోలు తిరుగుతూ ఉంటాయి.

క్రికెట్ కిట్ పంపిణీ



నవతెలంగాణ-డిండి

మండలంలోని గోనబోయినపల్లి గ్రామ క్రీడాకారులకు ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్ యాదవ్, డిండి ఉప సర్పంచ్ నూకం వెంకటేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అవుట మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. యువత క్రీడల్లో రాణించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నల్గొండ జిల్లా కార్యదర్శి పెరుమాళ్ళ అనిల్ కుమార్, యువజన కాంగ్రెస్ మండల నాయకులు దామోదర్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రేమ్ కుమార్, హుస్సేన్, ఫసీన్, అరవింద్, అమృత్, అజేష్, వరిమల్ల మల్లేష్, కొప్పు బాలకృష్ణ, మేడమోని శ్రీశైలం, బర్పటి వెంకటయ్య, నక్క సత్యనారాయణ, శ్రీపతి పుల్లయ్య, ఇమ్మిడి చెన్నయ్య, బర్పటి నరహరి, ఉరుకుంద కృష్ణాజి, మద్దెల దామోదర్,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సన్మానం

నవతెలంగాణ-మోటకొండూర్



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వవిప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సన్మానించాయి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | మే16. 2024 | www.navatelangana.com

గోడ కూలి వ్యక్తి మృతి



నవతెలంగాణ-నాగారం

పాత ఇల్లు కూల్చుతుండగా ప్రమాదవశాత్తు గోడలు మీద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగారం మండల పరిధిలోని పసునూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్లగంటి సుగుణమ్మ తన పాత కూల్చడానికి పని మనుషులను నియమించింది. ఈ క్రమంలో పాత ఇల్లు ను పడగొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు తుంగతుర్తి మండల పరిధిలోని సూర్య తండా గ్రామ అవాసం గుట్ట కింది తండాకు చెందిన గుగులోతు వెంకన్న (28) మీద పడడంతో తలకు తీవ్ర గాయమైంది ఈ క్రమంలో అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించి చికిత్స చేస్తుండగా మరణించాడు

ఆలయంలో పూలు, పండ్ల మొక్కల పెంపకం

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయిమందిరంలో విశేష పూజలు జరగడంతో పాటు పూజకు అవసరమయ్యే పూలు పండ్లు ఆకుల మొక్కల పెంపకం నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్ట్ సభ్యులు, అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి దినకర్, కార్యదర్శి రేకులపల్లి భాస్కర్‌రెడ్డి ప్రోత్సాహ సహకారంతో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రజిత మొక్కలను అందించగా కూలీలు అన్ని మొక్కలు పెరిగేలా నాటారు. ఆలయంలో మరియు విశేష చెట్లకు పూజలు చేసిన భక్తులు తమ కోరికలు నెరవేరడంతో తిరిగి ఆలయం కి వచ్చి దర్శనం చేసుకొని తమ మొక్కులు చెల్లించుకొని భక్తులు ఆలయ నిర్వాహకులతో సంతోషాన్ని పంచుకుంటున్నారు. అనేక ప్రత్యేక విశేష పూజలు జరుగుతున్న ఏకైక ఆలయంగా రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆధ్యాత్మిక సేవా చింతన గల ప్రజల ప్రశంసలు, ప్రోత్సాహకాలు పొందుతూ వస్తుంది. మరిన్ని కార్యక్రమాలు ముందుకు కొనసాగిస్తామని నిర్వాహకులు చెబుతూ ఆలయానికి విచ్చేస్తున్న దాతలు భక్తులు ప్రోత్సహిస్తున్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

రాష్ట్రంలోనే నల్లగొండ పార్లమెంట్‌కు అత్యధిక మెజారిటీ : జానారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోతెలంగాణ రాష్ట్రంలోనే నల్లగొండ పార్లమెంట్ స్థానానికిఅత్యధిక మెజారిటీ ఖాయమని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండపార్లమెంట్ స్థానంలో 8.50లక్షల నుంచి 5.50లక్షల వరకుమెజారిటీ రావడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో కార్యకర్తలు,నాయకులు, ప్రజలు కష్టపడి పార్టీ గెలుపుకు కృషి చేసినవారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే కాంగ్రెస్‌పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు సైతం తమ శక్తికిమించి అధిక మెజారిటీ కోసం పనిచేయడంహర్షణీయమన్నారు. వారందరికి పార్టీ తరుపున ప్రత్యేకఅభినందనలు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసంతమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవడంలో అన్నివర్గాలు, అన్ని పక్షాలకు, వామపక్షాలకు, ప్రజా సంఘాలనాయకుల సేవలు మరువలేనివన్నారు. ఇండియా కూటమిదేశంలో అత్యధిక స్థానాలు గెలిచి అధికారంచేజిక్కించు కుంటుందన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌పార్టీస్వాతంత్ర్య పోరాటంతోపాటు అనేక త్యాగాలు చేసి అసువులుబాసిన నాయకులు ఉన్నారని, ప్రజల కోసం, ప్రజాస్వామ్యంకోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, ఆదిశగానే ప్రజలుసైతం ఇండియా కూటమి విజయాన్ని కాంక్షిస్తూ ఓటు ద్వారా(ప్రజలు తమ అభిమతాన్ని వెలిబుచ్చారన్నారు. రాష్ట్రంలోఅత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంఖాయమన్నారు. తాను ఎల్లవేళలా ప్రజల కోసం వెన్నంటిఉంటానని, అదే జానారెడ్డికి ప్రజలు నన్ను గుర్తుంచుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, రామలింగం, తమ్మడబోయిన అర్జున్,తలకొప్పుల సైదులు, గోపగాని మాధవి పాల్గొన్నారు.

చట్నీస్‌లో అపరిశుభ్రత ఆహారం

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న, బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-చండూర్

స్థానిక మున్సిపాలిటీలోని చెట్నీస్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆహారంలో పురుగులు ప్రత్యక్షం కలకలం రేపుతోంది. సోమవారం సాయంత్రం 7:00 సమయంలో చండూరు మున్సిపాలిటీలో గల చెట్నీస్ బార్ అండ్ రెస్టారెంట్‌లోకి వెళ్లిన కస్టమర్లు మద్యం ఫుడ్ ఆర్డర్ చేస్తుండగా ఆహారంలో కలుపుకోవడానికి టేబుల్ పై నిల్వ ఉంచిన పెప్పర్ సాల్ట్ లో డబ్బా నిండా పురుగులు పారాడుతూ కనిపించాయి. సదరు బార్ అండ్ రెస్టారెంట్ సిబ్బందిని, యజమానిని వివరణ అడిగిన కస్టమర్లకు నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో కంగుతిన్న కస్టమర్లు ! ఇక చేసేదేమీ లేక ఆ పెప్పర్స్ సాల్ట్ లోని పురుగులను ఫోటోలు వీడియో రికార్డు చేసి, అనునిత్యం రద్దీగా ఉండే బార్ అండ్ రెస్టారెంట్లో ప్రత్యక్షంగా కనిపించే టేబుల్ మీద ఉన్నటువంటి ఉప్పు, పెప్పర్సాల్ట్, టేబుల్లు శుభ్రంగా లేక పురుగులు పట్టి ఉన్నప్పుడు! వారు బార్ అండ్ రెస్టారెంట్లో లోపల తయారు చేస్తున్నటువంటి సప్లై చేస్తున్నటువంటి ఆహారంలో, మద్యంలో ఇంకెన్ని ఘోరాలు జరుగుతున్నాయో, ఎన్ని కల్తీలు జరుగుతున్నాయో! ఎన్ని పురుగులు పట్టి ఉన్నాయో!అని మీడియా ముందు ఆధారాలతో సహా వాపోయారు. చండూరు మున్సిపాలిటీలో ఉన్నటువంటి



ఈ యొక్క చట్నీస్ బార్ అండ్ రెస్టారెంట్ లో బారు యజమాన్యం సిబ్బంది , వినియోగదారుల మధ్యన క్రమం తప్పకుండా ప్రతిరోజు ఎన్నో గొడవలు జరుగుతుండడం పై అధికారులు సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం, రెస్టారెంట్ లోనీ ఎన్నో అవకతవకలకు తావిస్తుందని చెప్పకనే చెప్పొచ్చని అంటున్న స్థానిక ప్రజలు. ఇకనైనా పై అధికారులు త్వరగా స్పందించి సదర్ చెట్నీస్ బార్ అండ్ రెస్టారెంట్ పై చర్యలు తీసుకొని కస్టమర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్

- స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు
- 12 జిల్లాలలో ఏఆర్వోలుగా అదనపు కలెక్టర్లు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ చాలా ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన తెలిపారు. బుధవారం నల్గొండ కలెక్టరేట్లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్గొండ పార్లమెంటు స్థానంలో 74.03 శాతం పోలింగ్ నమోదు అయిందని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా మరో 2 శాతం పోలింగ్ నమోదు అయిందని తెలిపారు.7 నియోజకవర్గాల నుండి ఈవీఎంలు జిల్లా కేంద్రంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేసామన్నారు. లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్4న ఉంటుందని తెలిపారు. వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి ఈనెల 2న నోటిఫికేషన్ విడుదలైందని, ఈనెల 13న నామినేషన్లు వేసిన వారిలో 11 మంది తమనామినేషన్లను ఉపసంహరించుకున్నారని, ఈ ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. ఈ ఉపఎన్నిక నియోజకవర్గ పరిధి 12 జిల్లాలలో ఉందని, 12 మంది అదనపు కలెక్టర్లు ఏఆర్ఓలుగా ఉన్నారని, పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టుకోవచ్చని, దానికి సంబంధించిన



అనుమతులు జిల్లా స్థాయిలో నైతే ఏఆర్వోల వద్ద తీసుకోవాలని, మొత్తం నియోజకవర్గమైతే నల్గొండ లోని ఆర్వో కార్యాలయంలో అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పార్లమెంట్ ఎన్నికల లాగానే ఉంటుందని, అభ్యర్థులు ఏవైనా ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ఎంసీఎంసీ వద్ద ప్రి సర్టిఫికేషన్ తీసుకోవాలన్నారు. ఈనెల 27న పోలింగ్ ఉంటుందని, నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ లు ఏర్పాటు చేశామని అక్కడినుండే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల పంపిణీ ఉంటుందని, పోలింగ్ అనంతరం 12 జిల్లాలకు చెందిన బ్యాలెట్ బాక్స్ లు అన్నీ నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌కి తరలిస్తామని తెలిపారు. జూన్5న నల్గొండ జిల్లా కేంద్రంలో కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను బుధవారం జిల్లా సంక్షేమ అధికారిని సక్కుబాయి తనిఖీ చేశారు. పిల్లల పూర్వ ప్రాథమిక విద్య, అంగన్వాడీ కేంద్రాల పని తీరు పర్యవేక్షించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, పాలు, గుడ్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసే విధంగా చూడాలన్నారు. ఆమె వెంట సీడీపీఎం ఆగసరా అన్‌జుమ్, సూపర్ వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సూర్యకళ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు లక్ష మెజార్టీ ఖాయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరు

భువనగిరి పార్లమెంట్ పరిధిలో సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి లక్ష పైగా మెజార్టీతో గెలుపొందుతాడని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్ల మహిళలు పెద్ద సంఖ్యలో మద్దతు తెలిపారని బుధవారం నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ప్రజలు పెద్ద ఎత్తున చర్చ జరిగి పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని నిర్ణయానికి వచ్చి కాంగ్రెస్ పార్టీకే ఓటేసి నట్లు పార్టీ అంతర్గతంగా తీసుకున్న సమాచారం ద్వారా తెలిసిందన్నారు.



బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి..

గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలబడిన బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి బీజేపీతో మీలాగత్తె కాంగ్రెస్‌ను ఓడించాలని చూసినప్పటికీ కొద్ది శాతం ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుల మాటలు నమ్మి క్రాస్ ఓటింగ్ ద్వారా బిజెపి పార్టీకి ఓటు వేశారని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 4 శాతం ఉన్న బీజేపీ నేడు 25 శాతం ఎంచుకుంది కేవలం కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకే బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో చేతులు కలిపిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకటే అని ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినా ఇంకా బుద్ధి రాలేదన్నారు.

కవిత బెయిల్ కోసం బీజేపీతో

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కూతురు కల్వకుంట్ల కవితకు బెయిల్ ఇప్పించుకోవడం కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అంతర్గతంగా మద్దతిచ్చినట్లు తెలిసిందన్నారు. ఆ రెండు పార్టీలు ఒకటైనా కాంగ్రెస్ పార్టీకి 12 స్థానాలు రావడం ఖాయమన్నారు.

కాంగ్రెస్‌కు లక్షకు పైగా మెజార్టీ వస్తుంది..

వంనంగోడ్ం భువనగిరి ఆలేరు జనగామ నకిరేకల్ నియోజక వర్గాలలో లక్ష ఓట్ల మెజార్టీ కాంగ్రెస్ పార్టీకి వస్తాయని అని ఇబ్రహీంపట్నం తుంగతుర్తి నియోజకవర్గాలలో బీజేపీ కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్యన హోరాహోరి పోరుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి 33శాతం బీజేపీకి 25శాతం బీఆర్ఎస్ పార్టీకి 14 శాతం, సీపీఐ(ఎం), ఇతరులకు కలిసి మరో నాలుగు శాతం ఓట్లు వస్తాయని కాంగ్రెస్ పార్టీ అంచనాకు వచ్చిందన్నారు.

ఓటింగ్ శాతం పెరగడం కాంగ్రెస్‌కు అనుకూలం

గ్రామీణ ప్రాంతాలలో పట్టణ ప్రాంతాల కంటే ఎక్కువ ఓటింగ్ పెరగడం కాంగ్రెస్ పార్టీకి లాభిస్తుందన్నారు. మహిళలు పురుషుల కంటే ఎక్కువ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం కాంగ్రెస్ పట్ల పాజిటివ్ ఓటుగా మారుతుందన్నారు. ఉచిత ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, జీరో కరెంట్ బిల్ పట్ల మహిళలు సంతోషంగా ఉన్నారని ఎన్నికల ప్రచారంలో తనకు కనబడిందన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి..

నల్గొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 27న జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను మెజార్టీతో గెలుపు తీరాన్ని దాటించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ ప్రకటించిందని తీన్మార్ మల్లన్న ఓడించేందుకు బీఆర్ఎస్ చేసే కుట్రలను గ్రాడ్యుయేట్ ఓటర్లు తిప్పికొట్టాలన్నారు.

బీఆర్ఎస్‌తో ఎన్నికల పోరాటం ఇంకా మిగిలే ఉంది

అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే వెనువెంటనే పార్లమెంటు ఎన్నికలు రావడంతో మండుటెండలను సైతం లేకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారని చేతులెత్తి మొక్కుతూ బీఆర్ఎస్ పార్టీతో ఇంకా పోరాటం మిగిలే ఉందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిట్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు పొందే విధంగా కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేద్దాం అన్నారు.

కేంద్రంలో ఇండియా కుటమిదే అధికారం..

ప్రస్తుతం జరిగిన నాలుగు విడతల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఇండియాకుటమికి అత్యధిక స్థానాలు లభిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయని రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి అధికారం చేపడుతుందన్నారు. జరగబోయే మరో విడతల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతూని చెప్పారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే జీతగానిలా పనిచేస్తా

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఓనర్‌గా కాకుండా ప్రజాసంక్షేమం కోసం, ప్రజల కోసం జీతగానిలా పనిచేస్తానని పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఆస్తి రాసిఇచ్చి రాజకీయాల్లోకి వచ్చిన తొలి వ్యక్తిని తానేనని అన్నారు. దీర్ఘకాలిక లక్ష్యంతో ముందుకెళ్తున్నానని పట్టబదులందరూ తనని ఆదరించాలన్నారు.ఆలేరు నియోజకవర్గం తన సొంత గడ్డ అని ఈ నియోజకవర్గంలో ఉన్న 100 శాతం ఓట్లు తనకే వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం తాను వందల కేసులు భరించానని ప్రజల హక్కుల కోసం ఆస్తుల కోసం కొట్లాడానని కాబట్టే తనకు ఓటు అడిగి హక్కు ఉందన్నారు. బీఆర్ఎస్ వల్లనే ఉపఎన్నిక వచ్చిందని వారికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ సమస్యలను పరిష్కరించే జిమ్మేదారి తనదే అన్నారు. 34 అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎమ్మెల్సీ పరిధిలో ఆలేరు మొదటి స్థానంలో ఉంచాలన్నారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ 27వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.ఆలేరు ప్రాంత వాసి గా ఆయన ను గెలిస్తే ఈ ప్రాంతానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసే వీలు మనకు వస్తుందన్నారు.మల్లన్న కోసం ప్రతి కార్యకర్త సైనికుల పనిచేసే భారీ మెజార్టీ వచ్చేలా చూడలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అండం సంజీవరెడ్డి, జనగాం ఉపేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్, మధుసూదన్ రెడ్డి నరేందర్ గుప్తా తండ మంగమ్మ, అశోక్, సింగిర్తి మల్లేష్, చీర శ్రీశైలం, శంకర్ నాయక్, మహేందర్ గౌడ్, బాలరాజ్ వెంకటరాజు, యాస లక్ష్మారెడ్డి, ఎల్లంల సంజీవరెడ్డి, శంకర్ నాయక్, స్థానిక నాయకులు ఎరుకల హేమేందర్, ముఖ్యర్ల మల్లేష్, బందరపు బిక్షపతి గుండు నరసింహ, గుడ్ల నరేష్ బొజ్జ సాంబేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల మయమైన రోడ్లతో...
వాహనదారుల ఇక్కట్లు

నవతెలంగాణ-మోత్కూర్

మున్సిపల్ కేంద్రంలో కొత్త బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు వందల మంది వాహనదారులు ప్రయాణం చేయాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని, పెద్ద వాహనాలు వెళ్లే క్రమంలో రోడ్లపై దుమ్ము, లేవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్లపై నీరు చేరి గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక కింద పడుతున్నామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెప్పుకోవడానికి పేరు మోత్కూర్ మున్సిపాలిటీ కానీ, రోడ్లు అధ్వానంగా తయారయిందని అధికారులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారని గుంతలపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పు పనులకు మాజీ ఎమ్మెల్యే నాలుగు కోట్లు కేటాయించగా. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యే, మందుల సామేల్, బీటీ రోడ్డుకు బదులు సీసీ వేయిస్తే బాగుంటుందని నిర్ణయం తీసుకోవడంతో పనులు మొదలు పెట్టే క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మొదలు పెట్టలేదని అధికారులు అంటున్నారు, రోడ్లు అధ్వానంగా తయారు కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్డు వెడల్పు పనులు మొదలుపెట్టి గుంతల మయంగా లేకుండా చూడాలని కోరుతున్నారు.


వివరణ: మున్సిపల్ కమిషనర్ బి శ్రీకాంత్



ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మెయిన్ రోడ్ పనులు చేపట్టలేకపోయాం త్వరలోనే రోడ్డు వెడల్పు పనులు మొదలు పెడతాం.

19న మిర్యాలగూడలో జల్సా

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఈ నెల19న ఆదివారం మిర్యాలగూడలో ఉస్మానియా మజీద్ లో మౌలానా అతికుర్ రహమాన్ ఆధ్వర్యంలో అజీమిస్ షాన్ జల్సా నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ ముస్లిం మత పెద్దలు హాఫిజ్ ఫ్దీన్ పాషా, అహ్మద్ చావుస్ తెలిపారు. బుధవారం స్థానిక ఉస్మానియా మసీదులో జల్సా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జల్సాకు గుజరాత్‌కు చెందిన మత పెద్దలు మౌలానా సలావుద్దీన్ సైఫీ హాజరౌతున్నట్లు తెలిపారు. 19వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఈ జల్సా కొనసాగుతుందని చెప్పారు.జిల్లాలోని పలు పరిసర ప్రాంతాల ముస్లిం సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై జల్సా ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా కమిటీ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్, అంజాద్, బాబా, తౌఫిక్, కమిటీ సభ్యులు మొహమ్మద్ రఫీక్, హాఫిజ్ అబ్దుల్ మన్నాన్, మార్కజ్ పాషా, షఫీ, రైస్, జుబేర్, సాదిక్, షరీఫ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

నవతెలంగాణ-మిర్యాలగూడ



రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన బుధవారం మిర్యాలగూడలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తగూడెంలో గల స్వామి దయానంద సరస్వతి వృద్ధాశ్రమంలో ఉంటున్న గౌరు మట్టయ్య (70) బుధవారం ఉదయం ఆశ్రమం నుండి సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రధాన రహదారి దాటుతున్నాడు. దామరచర్ల నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పట్టణంలోని వాసవి నగర్ కాలనీ వాసిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పై మృతుడి కుమారుడు రాంబాబు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు.